క్లుప్తంగా

20న చలో విజయవాడ



చలోవిజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ, సీఐటీయూ నాయకులు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, సిద్దమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణంలో చలో విజయవాడ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అంతకు ముందువారు కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌కు ముందస్తు సమాచారం నోటీసును అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయమ్మ, సుమలత, జయమ్మ, అనిత, స్వప్న పాల్గొన్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోండి



సహకార సంఘంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ రాజేంద్రకుమార్

ఓబులవారిపల్లె: రైతులకు ఇస్తున్న రుణాలకు సంబంధించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా నగదు చెల్లించే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సహకార సంఘాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు బకాయిలను సకాలంలో రెన్యూవల్ చేసుకొని లావాదేవీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బాలచంద్ర, సిబ్బంది వెంటరమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు



యర్రగుంట్లలో ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సంబేపల్లె : మండల పరిధిలోని యర్రగుంట్ల సమీపంలో ఉన్న బాలయోగి గురుకుల కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. 281 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 280 మంది హాజరయ్యారు.

వసతి గృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ అధికారి డి.జాకీర్ హుస్సేన్

గాలివీడు : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని శనివారం అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి డి.జాకీర్ హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ నెలలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రవీంద్ర నాయక్, రవిబాబు, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



చిన్నమండెంలో ఫుట్ పెట్రోలింగ్‌లో పాల్గొన్న ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది

చిన్నమండెం : అసాంఘిక కార్యకలాపాలపై మండల వ్యాప్తంగా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి భవిష్యత్తు

గుర్రంకొండ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని హెడ్మాస్టర్ మదన్‌మోహన్ అన్నారు. శనివారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

పనులు అసంపూర్తి.. ప్రజల్లో అసంతృప్తి

- పెండింగ్‌లో జాతీయ రహదారి విస్తరణ పనులు
- మురికికాలువ నుంచి వెదజల్లుతున్న దుర్వాసన



రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో ఇంటిలోకి కూడా వెళ్లలేని పరిస్థితి

చిన్నమండెం : చిన్నమండెం మండల కేంద్రంలో 340వ జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. కాగా మిగిలిన పది శాతం పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట 50 మీటర్లు, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట హోటళ్ల వద్ద కాల్వ నిర్మాణ పనులు చేయకుండా వదిలివేశారు. దీనివల్ల మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దానికితోడు ఈ ప్రాంతవాసులు పలువురు పలు రకాల జ్వరాలబారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ పనులు పూర్తి చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మిగిలిన పనులను పూర్తి చేయాలి



మిగిలిన జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలి. మురికికాలువ గుండా పలు రకాల వ్యర్థాలు రావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికే జ్వరాల బారిన పడి పలు ఆసుపత్రులకు వెళ్లి వచ్చాం.

– మోహన్‌కుమార్, చిన్నమండెం

ఎన్‌హెచ్ అధికారులు స్పందించాలి



జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు ఎన్‌హెచ్ అధికారులు వెంటనే స్పందించాలి. 90 శాతం పనులు పూర్తి చేసి మిగిలిన పది శాతం పనులు వదిలేయడం తగదు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

–నాగమ్మ, చిన్నమండెం



మురికికాలువలో నిలబడిపోయిన వ్యర్థపదార్థాలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి
- రాజంపేట, నందలూరులో స్పెషల్ లోక్ అదాలత్
- దంపతుల కేసుల పరిష్కారం దిశగా చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

రాజంపేట : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి అన్నారు. శనివారం ఎన్‌టీఆర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు తమకు రక్షణ కల్పించే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే బాండు కాలవ్యవధి మూడు సంవత్సరాలు ఉంటుందన్నారు. మూడు సంవత్సరాల లోపు డబ్బు ఇవ్వని పక్షంలో కోర్టులో ఫైల్ చేసుకోవచ్చన్నారు. మూడు సంవత్సరాల తర్వాత ఆ బాండు చెల్లదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, గిరీష్, గోవర్దన్, భరత్, మస్తాన్, సాహిద్‌లు వివిధ చట్టాల గురించి వివరించారు.

రాజంపేట కోర్టులో..

రాజంపేట కోర్టులో శనివారం 3వ అదనపు జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. విడాకుల కేసును పరిష్కరించి, భార్యాభర్తలను కలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నందలూరు కోర్టులో..

నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జడ్జి లత అధ్యక్షతన స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో కుటుంబ తగాదాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో దాసరి నరసింహులు, ఫైజుల్లాఖాన్ లోడి, న్యాయవాదులు ఆనంద్‌కుమార్, షేక్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం విశేష కృషి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



విద్యార్థులకు కిట్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎంపీపీ గాలివీటి, చొప్పా

రాజంపేట రూరల్ : రాష్ట్రంలోని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కారంపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం హెడ్మాస్టర్ డి.సుబ్బరాయుడు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు కేకేరెడ్డి(యుఎస్‌ఏ) చేయూతతో ఆయన తల్లి మన్నూరు రామలక్షుమ్మ పరీక్షా సామగ్రి కిట్‌ను అందజేశారు. ఈ కిట్‌ను సీనియర్ నాయకులు చొప్పా యల్లారెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, హెడ్మాస్టర్ సుబ్బరాయుడులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలను కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 2022–23 విద్యాసంవత్సరం పూర్తికాకముందే 2023 – 24 సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల అడ్మిషన్లను 60 శాతం వరకు పూర్తి చేశారని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు కార్తీక్, ప్రకాష్, శివకుమార్, నరేష్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. 54.42 లక్షలు పలికిన సంత వేలం



సంత వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

గాలివీడు : పశువుల సంత, కూరగాయల సంత, బస్టాండ్ గేటుకు సంబంధించి నిర్వహించిన వేలంపాటలో రూ. 54.42 లక్షలకు నాయునివారిపల్లెకు చెందిన కె.బాలప్ప నాయుడు దక్కించుకున్నట్లు రాయచోటి డీఎల్‌పీఓ నారాయణ తెలిపారు. శనివారం గాలివీడు పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ శేఖర్ నాయక్, వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మల సమక్షంలో ఈ వేలంపాటను నిర్వహించామన్నారు. పశువుల సంత రూ. 30,11,500లు, కూరగాయల సంత రూ. 15,50,000, బస్టాండ్ గేటు రూ.8,80,500లు గరిష్ట వేలానికి బాలప్ప నాయుడు సొంతం చేసుకున్నట్లు వారు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది వేలంపాట ద్వారా పంచాయతీ ఆదాయం పెరిగిందన్నారు. ఈ వేలంపాటలో పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

పీలేరు : పీలేరు పట్టణం తిరుపతి మార్గంలో ల్యాండ్ కన్వర్షన్ భూములను రాయచోటి ఆర్డీఓ రంగస్వామి శనివారం పరిశీలించారు. ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నెంబరు 783/4లో 64 సెంట్లు, 784/2లో 2.62 ఎకరాలు, గూడరేవుపల్లె పంచాయతీ 203/4లో 2 ఎకరాల భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుటకు దరఖాస్తులు అందాయి. సంబంధిత భూములను శనివారం ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజశేఖర్, వీఆర్వోలు యోగానంద్, రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒంటిమిట్టకు కలెక్టర్ రాక

ఒంటిమిట్ట(సిద్దవటం) : కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆదివారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఆయనతో పాటు టీటీడీ ఎగ్జిక్యూటివ్ అధికారిధర్మారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీఎం సాయికాంత్‌వర్మ, టీటీడీ అధికారులు ఒంటిమిట్టకు రానున్నారు. వీరు కల్యాణ వేదికను పరిశీలించి, అనంతరం కల్యాణ వేదిక సమీపంలో గల టీటీడీ సమావేశ భవనంలో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

21న సంత వేలంపాట

చిన్నమండెం : ఈ నెల 21వ తేదీన వారపు సంత, దినసరి సంత వేలం పాటలు నిర్వహించనున్నట్లు చిన్నమండెం సర్పంచ్ అమీరాబీ, పంచాయతీ సెక్రటరీ పద్మావతిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలు చిన్నమండెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారన్నారు. గ్రామ ప్రజలు సంత వేలంలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

ఓబులవారిపల్లెలో మోస్తరు వర్షం

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎలాంటి గాలులు లేకుండా ఏకధాటిగా గంటపాటు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. ఎండవేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం రాక కొంత ఉపశమనం కలిగించింది.

వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలి

డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్



టీకాలపై ఆరా తీస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

వాల్మీకిపురం : వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలని అన్నమయ్య జిల్లా డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మశ్లపల్లి గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణికి, పుట్టిన ప్రతి శిశువుకు క్రమం తప్పకుండా ఏ వయసులో ఇవ్వాల్సిన టీకాలు ఆ వయసులోనే ఇవ్వాలన్నారు. టీకాలు ప్రారంభించుటకు ముందు లబ్ధిదారుల లిస్టు, తల్లి బిడ్డల సంరక్షణ కార్డులు, కోల్డు చైను ప్రకారం నాలుగు పాక్సువ్యాక్సిను కిట్టులో వ్యాక్సిను, డైల్యూయంట్స్, సిరంజిలు, ప్రతికూల రియాక్షన్‌లు వస్తే మెడిసిన్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవిద్య, సూపర్‌వైజర్లు పూర్ణమ్మ, హెల్త్ అసిస్టెంటు అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ రెడ్డెమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

• వైభవంగా శివ పార్వతుల కల్యాణం



సిద్దవటం: శివ, పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సిద్దవటం : మండలంలోని పి. కొత్తపల్లె పంచాయతీ వెంకటాయపల్లె గ్రామ శివారులోని అంభాపుర పార్థవేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నూతన ధ్వజస్తంభం, నాగులు, నవగ్రహాల విగ్రహాలను వేద పండితులు మల్లికార్జున శర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్ శర్మలు వేద మంత్రాల మధ్య ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



చిన్నమండెం : ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లె గ్రామంలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో..



సంబేపల్లె: లక్ష్మీ వెంకటేశ్వరులు

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లెలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

మేడాలమ్మ తల్లికి..



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మేడాలమ్మ

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో మేడాలమ్మ తల్లికి శనివారం ఆలయ పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ తల్లిని పూజిస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి..



పెనగలూరుఏకాదశి పూజలు అందుకున్న వెంకటేశ్వరస్వామి

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి పార్వేట స్థలంలో ఉన్న వెంకటేశ్వరస్వామికి శనివారం పూజారి చంద్రశేఖర్ శర్మ, నైసా జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ పురోహితుడు సుబ్బనరసయ్య పాల్గొన్నారు.

సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి దేవస్థానానికి భూమి పూజ



రాజంపేట రూరల్:దేవస్థానం నిర్మాణానికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, గాలివీటి, చొప్పా

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పెద్దకారంపల్లి దళితవాడలో ఎన్‌ఆర్‌ఐ కేకేరెడ్డి(యూఎస్‌ఏ) రూ.25 లక్షల తన సొంత నిధులతో చేపట్టిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి దేవస్థాన నిర్మాణానికి శనివారం ఘనంగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, సీనియర్ నాయకులు చొప్పా యల్లారెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డిలు హాజరై మాట్లాడారు. కేకేరెడ్డి తల్లిదండ్రులు మన్నూరు నారాయణరెడ్డి, రామలక్షమ్మల ఆశీర్వాదం, దేవుని దీవెనలతో కేకేరెడ్డి కుటుంబం దినాదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ భూమిపూజలో మన్నూరు వెంకటసుబ్బారెడ్డి, కె.శివరామిరెడ్డి, రఘురామరాజు, డి.సుబోధ్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి ఎం. సురేఖ, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి పెంచలయ్య, పెద్దకారంపల్లి, ఎంజీ పురం ఎంపీటీసీలు ఎ.వరదరాజు(బాబు), ఎ.మధుబాబు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హామీ ఇచ్చే వరకు పోరాటం



మున్సిపల్ ఉద్యోగులతో చేయి చేయి కలుపుదాం కార్యక్రమంలో ఏపీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నేతలు

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల సమస్యలపై 50 పేజీల డిమాండ్‌లతో కూడిన లేఖపై ప్రభుత్వం లిఖిత పూర్వకమైన, స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమాన్ని ఆపబోమని ఏపీ జేఏసీ రాష్ట్ర నేత కృష్ణమోహన్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన చేయి చేయి కలుపుదాం కార్యక్రమంలో భాగంగా ఆయన రాయచోటికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీ జిల్లా నేతలతో కలిసి మున్సిపల్, సచివాలయం, ఆర్టీసీ, కలెక్టరేట్ కార్యాలయాలలోని ఉద్యోగులను కలుసుకున్నారు. ఉద్యమిస్తున్న నేతలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అప్పటి వరకు విధిగా నల్లబ్యాడ్జీలతో హాజరు కావాలని తెలిపారు. అనంతరం ఎన్‌జీఓహోంలో ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత నరసయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరసింహకుమార్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, రాష్ట్ర వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రామ సచివాలయాల అధ్యక్షుడు ఆర్లయ్య, రెవెన్యూ, ఆర్టీసీ, సచివాలయం, కలెక్టరేట్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించాలి

కలికిరి: చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లలో చిరుధాన్యాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సమావేశంలో పీఎం మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు తెలియజేశారు. చిరుధాన్యాల పంటలను తక్కువ సాగునీరు, తక్కువ ఎరువులు వినియోగంతో సాగు చేయవచ్చన్నారు.

అడవులు, వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



చిట్వేలి: సమావేశంలో మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ ఆర్.నారాయణ



సిద్దవటం: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ రేంజర్ ఓబులేసు

చిట్వేలి: ప్రకృతి సిద్ధంగా వెలసిన అడవులు, వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత అని చిట్వేలి ఫారెస్టు ఇన్‌చార్జి రేంజర్ ఆర్.నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో చిట్వేలి, కొండూరు శాఖ అధికారులతో కలిసి ఆయన అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రఖ్యాతిగాంచిన లక్ష్మీనరసింహస్వామి అభయారణ్యంలో అత్యంత విలువైన ఎర్రచందనం, వెదురు, పలు రకాల ఔషధ మూలికలు ఉన్నాయన్నారు. చిరుతపులులతోపాటు వన్యప్రాణులు ఉండటం ఎంతో గర్వకారణమన్నారు. కొందరు ఆకతాయిల చర్యల వలన పచ్చగా ఉన్న అడవి అగ్నికి ఆహుతవుతోందన్నారు. దీన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. అడవి జంతువులను వేటాడటం, అటవీ సంపదను దొంగిలించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని చిట్వేలి ఎఫ్‌ఎస్‌ఓ శ్రీనివాసులు, కొండూరు ఎఫ్‌ఎస్‌ఓ సావిత్రమ్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారులు వెంకటసుబ్బమ్మ, కరీముల్లా బాషా, కేవీ సుబ్బయ్య, సీహెచ్‌ఎస్ సభ్యులు ఇంతియాజ్ అహ్మద్, జి.శివారెడ్డి, అటవీశాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పుపై అవగాహన

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాంధీవీధిలోని గంగమ్మ గుడివద్ద, కమ్మపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం అడవికి నిప్పు.. మానవాళికి ముప్పుపై డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల తరతరాలుగా పెంచి పోషించిన వృక్షజాతి, జంతు జాతి నశించి పోతాయన్నారు. అలాగే అడవుల్లోని వణ్యప్రాణులను, ఎర్రచందనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దీపిక, పెంచల్‌రెడ్డి, హైమావతి, మాజీ సర్పంచ్ ఓబులయ్య, సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లక్ష్మిరెడ్డి, సభ్యుడు మునెయ్య, ప్రజలు పాల్గొన్నారు.